క్లుప్తంగా

జమాతే ఇస్లాం ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాల పంపిణీ

మంగళగిరి: జమాతే ఇస్లాం మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని జమ్ జమ్ హోటల్ ఎదుట ఉచితంగా పుస్తకాల్ని పంపిణీ చేశారు. ఖురాన్, ఇస్లామిక్ తెలుగు సాహిత్యం పుస్తకాలను అడిగిన ప్రతి ఒక్కరికీ కులమతాలకు అతీతంగా అందించారు. ఇస్లాం ధార్మిక అవగాహన కల్పించేందుకు, ప్రజల్లో మత సామరస్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జమాతే ఇస్లాం మంగళగిరి శాఖ ప్రతినిధులు తెలిపారు.కార్యక్రమంలో మంగళగిరి జేఐహెచ్ నగర సభ్యులు, కార్యకర్తలు, ఐవైఎం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరుకలపూడి ఎస్సీ కాలనీకి విద్యుత్ వెలుగులు



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని పెరుకలపూడి ఎస్సీ కాలనీవాసులు వీధి లైట్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా కాలనీవాసులు వీధిలైట్లు కావాలని కోరడంతో స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడారు. ఎస్సీ కాలనీకి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆర్కే ఆదేశాల మేరకు ఆదివారం కాలనీలో కొత్తగా విద్యుత్ స్తంభాల్ని ఏర్పాటు చేసి వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే ఆర్కేకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కత్తులపేటలో కార్డన్ సెర్చ్



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కత్తులపేటలో ఆదివారం సాయంత్రం సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తాడేపల్లి పశువుల హాస్పిటల్ దగ్గర నుంచి కత్తులపేటకు వెళ్లే బకింగ్ హామ్ కెనాల్ ఒడ్డున ఉన్న ప్రతి ఇంటిలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. తాడేపల్లి ఎస్ఐలు వినోద్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు, గిరిబాబు తదితరులు టీమ్‌లుగా విడిపోయి కత్తుల పేటకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి, లోపలి వ్యక్తులు బయటకు రాకుండా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వేర్వేరు ప్రాంతాల నుంచి పలువురు వచ్చి నివాసముంటున్నార న్నారు. ఎవరు ఏం చేస్తున్నారో తెలుసుకునేందుకు ప్రతి ఇంటిలో తనిఖీలు చేపట్టామని ఆయన తెలిపారు. సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాల్ని కూడా సీజ్ చేస్తున్నామని చెప్పారు. తనిఖీలు పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు): వీఆర్వో (గ్రామ పునర్నిర్మాణ సంస్థ) ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలలో చిన్నారులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, పలకలు స్టేషనరీ ఆదివారం అందజేశారు. వీఆర్వో సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ శౌరిరాజు మాట్లాడుతూ వెల్లటూరు జగనన్న కాలనీలో చిన్నారులకు వీటిని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చొటూరి లక్ష్మి, రవీంద్ర, సంస్థ రేపల్లె సర్కిల్ కో–ఆర్డినేటర్ కె.దేవకి, సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కొల్లూరు : ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదయ్యింది. పోలీసులు వివరాల మేరకు.. చినపులివర్రుకు చెందిన శొంఠి నాగేశ్వరరావు కుమారుడు లక్ష్మణ్ (27) అప్పుల బాధతో గత నెల 27న పురుగు మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పట్నుంచి పలు వైద్యశాలల్లో చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స తీసుకుంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

బాపట్లటౌన్: కుటుంబ కలహాల విషయంలో వ్యక్తిపై కర్రలతో దాడిచేసిన ఘటన పట్టణంలోని దేవుడి మాన్యంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే దేవుడు మాన్యంకు చెందిన మోపర్తి సుధాకర్‌ను అతని బావ శ్రీనివాసరావు, అక్క సునీత, మేనల్లుడు నవీన్, మేనకోడలు చిన్నిలు కలిసి కర్రలతో దాడిచేశారని ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనం

- రెండునెలలుగా జిల్లాలో ఇంటింటికీ రేషను పంపిణీ
- అపోహలతో బియ్యం తీసుకోని కొందరు కార్డుదారులు

తెనాలి: 'రేషను బియ్యం నీళ్లలో తేలుతోంది... ప్లాస్టిక్ బియ్యం కలిపార్రోయ్...' విద్యావంతుడైన ఓ మాజీ విలేకరి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఇది...సాధారణ ప్రజల్నుంచీ అక్కడక్కడా ఈ మాటలనే వింటున్నాం. కొందరు కార్డుదారులు బియ్యం తీసుకోవడం లేదు. బదులుగా కిలో రూ.10 చొప్పున డబ్బులు తీసుకుంటున్నారు. పేద ప్రజలకు బలవర్ధక ఆహారం పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వ్యయప్రయాసలకోర్చి ఇంటింటికీ సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రేషను బియ్యంపై అపోహలకు ఇంతకు మించిన ఉదాహరణలు ఏముంటాయి? అక్కడక్కడా పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం, కార్డుదారులు వద్దనుకుని డబ్బులు తీసుకున్నవే.

గత జూన్ నెలనుంచి...

గుంటూరు జిల్లాలో గత జూన్ నెలనుంచి రేషను కార్డుదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలోని 5.94 లక్షల కార్డుదారులకు ప్రతినెలా ఫోర్టిఫైడ్ బియ్యాన్నీ, కిలో రూ.16లకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. నెలకు 8,000 టన్నుల బియ్యం కార్డుదారులకు చేరుతోంది. రేషను సరుకులేంటీ గతంనుంచీ ఉన్న చిన్నచూపు ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుత ప్రభుత్వం పోషకాలు జతచేసిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇస్తున్నా, అవగాహన లేమి, దుష్ప్రచారంతో చేజేతులా వదులుకుంటున్నారు. వాస్తవానికి ఫోర్టిఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. 5వ జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం మనదేశంలో అయిదేళ్లలోపు పిల్లల్లో 32.1 శాతం సాధారణంగా ఉండాల్సిన బరువుకన్నా తక్కువగా ఉన్నారు. 35 శాతం పిల్లలు వయసుకు ఉండాల్సినంత ఎత్తు పెరగటం లేదు. సాధారణ మహిళలు, గర్భిణులు 50 శాతంకన్నా ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో పోషకాల లోపమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పాల్సిన పనిలేదు. ఈ లోపాన్ని పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం ఆహారపదార్థాల ఫోర్టిఫికేషన్ ప్రక్రియను ప్రోత్సహిస్తోంది. ఆ ప్రకారం రాష్ట్రప్రభుత్వం, ప్రజాపంపిణీలో భాగంగా వినియోగదారులకు అందిస్తున్న సాధారణ రేషను బియ్యానికి బదులు పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీని చేపట్టింది. ఇంటింటికీ రేషనులోనే కాకుండా గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారు.

మన ఆహారంలో పోషకాలు...

మన ఆహారంలో ప్రధానమైన బియ్యం మిల్లింగులో ఏవైతే విటమిన్/పోషకాలు లోపిస్తాయో? వాటిని చేర్చడమే ఫోర్టిఫికేషన్. నిర్ణీత పరిమాణంలో బియ్యం పిండికి, సూక్ష్మధాతు పోషకాల మిశ్రమం కలిపి బియ్యం రూపాన్ని పోలివుండే ×కర్నల్స్‌<ను తయారుచేస్తారు.

వీటిలో ఐరన్ 42.5 మిల్లీగ్రాములు, ఫోలిక్ 1250 మైక్రోగ్రాములు, బీ12 విటమిన్ 12.5 మైక్రోగ్రాములు ఉంటాయి. డ్రై చేశాక వీటిని బియ్యంలో కలుపుతారు. గోధుమపిండిని కూడా సంప్రదాయ విధానమైన తిరగలితో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ చేస్తున్నారు. మార్కెట్‌లో సాధారణ రకం గోధుమ పిండి కిలో రూ.30, బ్రాండెడ్ కంపెనీల ఆటా అయితే కిలో రూ.60 వరకు ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వం బలవర్ధకమైన బియ్యాన్ని ఉచితంగా, గోధుమలను కిలో రూ.16 చొప్పున ఇస్తుంటే వాటిని వినియోగించితేనే కదా ఫలితాలను పొందగలిగేది.

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంపూర్ణ పోషణ, గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకాలతో రక్తహీనత క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. 5వ జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే ప్రకారం గర్భిణుల్లో రక్తహీనత 52.9 శాతం నుండి 53.9 శాతానికి పెరిగింది. 15–19 వయసుగల బాలికల్లో 61.1 నుండి 60.1 శాతానికి తగ్గింది. 15–19 వయసుగల బాలురలో 29.3 శాతం నుంచి 18.7 శాతానికి తగ్గుదల నమోదైంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పోల్చుకుంటే రాష్ట్రం మెరుగైన స్థితిలో ఉంది. ఫోర్టిఫైడ్ బియ్యంతో మరింత ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందని చెప్పొచ్చు.



వాహనంతో రేషను పంపిణీ



ఫోర్టిఫైడ్ బియ్యం

రక్తహీనత సమస్యను అధిగమిస్తారు...

ఫోర్టిఫైడ్ బియ్యం తయారీకి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. బలవర్ధకమైన పోషకాలు కలిగిన బియ్యాన్ని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నాం. ఈ బియ్యంతో రక్త శుద్ధి జరిగి, రక్తహీనత తగ్గుతుంది. నాడీవ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు అపోహలకు పోకుండా తప్పనిసరిగా వినియోగించాలి.

– కోమలి పద్మ, జిల్లా పౌరసరఫరాల అధికారి

క్వింటాలు బియ్యంలో కిలో ..

పోషకాలు కలిపి తయారు చేసిన బియ్యాన్ని పోలిన కర్నల్స్‌ను, రైస్‌మిల్ ఫ్లోర్‌లో డ్రై చేస్తారు. తర్వాత రైస్‌మిల్లర్స్‌కు వస్తాయి. క్వింటాలు బియ్యంలో 99 కిలోలు సార్టెక్స్ బియ్యం, ఒక కిలో కర్నల్స్ కలుపుతాం. ఈ బియ్యం వినియోగిస్తే రక్తహీనతను నివారించవచ్చు.

– పావులూరి రాంబాబు, కార్యదర్శి, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: రివర్స్ ఆఫ్ లైఫ్ సంస్థ ఆధ్వర్యంలో అమరావతి ప్లాట్స్‌లోని స్టేడియం వద్ద ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ సునీల్, మార్కెట్ కమిటీ సభ్యులు సాంబశివరావు, రివర్స్ ఆఫ్ లైఫ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మాధవి, కొమ్ము ఆశీర్వాదం, నీల వర్ధన్, యాసిన్, ఇర్ఫాన్, చైతు, మున్నా, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: తాడిబోయిన నాగేశ్వరరావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ 25వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు, యాచకులకు అన్నదానం చేశారు. ముందుగా నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుర్రా శ్రీను, తుళ్లిమిల్లి చంటి, శివారెడ్డి, ఉద్దంటి గిరీష్, కుర్రా యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా శాంతి ర్యాలీ

తెనాలిటౌన్: మణిపూర్ రాష్ట్రంలో కుకి తెగలపై జరుగుతున్న అత్యాచారాలు, చర్చిలను తగులబెడుతున్నందులకు నిరసనగా క్రైస్తవ సంఘాలు, ముస్లిం, అంజుమన్ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. రూరల్ మండలం కొలకలూరులోని ఎబిఎం, ఆర్‌సిఎం చర్చిల వద్ద నుంచి నందివెలుగు సెంటర్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువకులు, ముస్లిం, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నడవలేని వృద్ధులు ఆటోల్లో నందివెలుగు చేరుకున్నారు. అక్కడి రోడ్డుపై ఆయా సంఘాల నాయకులు ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తెనాలి–విజయవాడ రోడ్డుపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. శాంతి ర్యాలీలో సంఘాల నాయకుల మాట్లాడారు. క్రైస్తవులు, గిరిజనులపై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, దేశంలో మతోన్మాదం నశించాలని, చర్చిల మీద దాడులు అరికట్టాలని, మణిపూర్‌ను రక్షించాలని. ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని, మేము భారతీయులమేనని నినాదాలు చేశారు. ర్యాలీలో పాస్టర్ ఎస్.సురేష్, బ్రదర్ పరిశుద్ధరావు, ఆర్‌సిఎం చర్చి ఫాదర్ సాగర్ థామస్, పాస్టర్‌లు స్టీవెన్‌పాల్, రాకడపాల్, బర్నబాసు, చంద్రబాబు, కుమార్, చిన్ని, మసీదు ఇమామ్, ఆర్‌సిఎం సిస్టర్స్, ఎబిఎం చర్చి ప్రెసిడెంట్ సుద్దపల్లి శరత్ వెంకయ్య, జైభీమ్ ఫెడరేషన్ నాయకులు కఠెవరపు దేవయ్య, కె.అబ్రహాంలింకన్, కొలకలూరి నాగేశ్వరావు, సుద్దపల్లి మురళీదర్, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ బాజి, షేక్ జానీ, బాసిదా, ప్రసాదం బాలగురవమ్మ, పొన్నెకంటి రమేష్, కొలకలూరు, కంచర్లపాలెం, నందివెలుగు, గుడివాడ గ్రామాలకు చెందిన యువకులు, మహిళలు, చిన్నారులు, ఆయా సంఘాల నాయకలు పాల్గొన్నారు.



నందివెలుగు సెంటర్‌లో ర్యాలీలో మాట్లాడుతున్న పాస్టర్లు



శాంతి ర్యాలీలో పాల్గొన్న మహిళలు

శత సంవత్సర జన్మదినోత్సవం



తెనాలిటౌన్: రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామానికి చెందిన మోతుకూరు సుబ్బారావు శత సంవత్సర జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా జరిపారు. సుబ్బారావు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి చేరుకున్నారు. ఆయన గృహంలో కుమారులు, కుమార్తెలు కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మునిమనుమలు, బంధువులు సుబ్బారావును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కుమారులు తండ్రి కాళ్లు కడిగి ఆయనకు నమస్కరించారు. సుమారు 60 నుంచి 70 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆయనకు 5గురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు కాగా వారిలో నలుగురు మగ, ఇద్దరు ఆడపిల్లలు ప్రస్తుతం ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించి కష్టపడి పిల్లలను పెంచారని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని కుమారులు వెంకట్రావు, అర్జునరావు, వెంకటకృష్ణ, ఏడుకొండలు పర్యవేకించారు. వైఎస్సార్ సీపీ నాయకులు యలవర్తి సాంబశివరావు, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పి వెంకట సత్యనారాయణలు పాల్గొన్నారు.

మెడికల్ రిప్రజంటేటివ్ ఆత్మహత్య

తాడేపల్లి రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మెడికల్ రిప్రజంటేటివ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆదివారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. యస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం..తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం, తాళ్లపూడికి చెందిన నిట్టా రాజేష్ (28) 2014లో వివాహం చేసుకుని భార్య అరుణతో కలసి తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్ 20వ లైన్‌లో నివాసముంటూ విజయవాడలో మెడికల్ రిప్రజంటేటివ్‌గా పని చేస్తున్నాడు. మెడికల్‌కు సంబంధించి వ్యాపారం చేయగా అందులో నష్టం రావడంతో ఆర్థికఇబ్బందులు ఏర్పడ్డాయి. భార్య అరుణ కుమార్తెతో కలసి పుట్టింటికి వెళ్లింది. ఈ సమయంలో రాజేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. శనివారం సాయంత్రం నుంచి బయటకు రాకపోవడంతో ఇంటి ఓనర్‌కు అనుమానం వచ్చి కిటికీలు పగలకొట్టి చూశాడు. రాజేష్ ఉరి వేసుకుని కనిపించడంతో భార్యకు సమాచారం ఇచ్చాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ వినోద్ తెలిపారు.

తెనాలిలో ద్విచక్ర వాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తెనాలిఅర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక–కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ తెనాలి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీదుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డిలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తుందని విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన వాటిని అనాధికారికంగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, మంగళగిరి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, ఎం.యలమందయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక జ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరం

ఇమామ్ ఇబ్నేబాజ్ రబ్బానీ

మంగళగిరి: ధార్మిక జ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, దాని ద్వారానే సమాజంలో గౌరవ మర్యాదల్ని పొందవచ్చని ఇమామ్ ఇబ్నేబాజ్ రబ్బాని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం మస్జీద్–ఎ–మొహమ్మద్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఇస్లాం ధార్మిక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జ్ఞానం అనేది దైవ ప్రవక్తల సొత్తు అని, ధార్మిక విద్య నేర్చుకున్న వారు ప్రవక్తల వారసులని చెప్పారు. సమాజంలో గౌరవ మర్యాదలు పొందాలంటే ఖురాన్ జ్ఞానం కలిగి ఉండాలన్నారు. నేడు సమాజంలో కొందరు పేరుకే ముస్లింలుగా జీవిస్తున్నారని, ఇస్లాంతో వారి సంబంధమే లేదన్నట్లుగా వ్యవహరించడం బాధాకరమని తెలిపారు. జ్ఞానం నేర్చుకుని పంచాలని, తద్వారా జ్ఞానుల స్థాయిని అల్లాహ్ పెంచుతాడని చెప్పారు. కార్యక్రమంలో ఇమామ్ ఇబ్నేబాజ్ ఉస్మాన్, మస్జీద్–ఎ–మొహమ్మద్ ఇమామ్ ఫయాజ్ ఆలం పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఇమామ్ ఇబ్నేబాజ్ రబ్బాని

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మంగళగిరి: నగరంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో సమీపంలోకి ఎవరు వెళ్లినా విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా కల్యాణ మండపంలో తరచూ జరిగే శుభ కార్యక్రమాలకు సమీపంలోని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు భోజనాలు చేసేందుకు వస్తుంటారు. గమనించిన శుభకార్యాల నిర్వాహకులు వారిని వెంబడించే క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వెనుకకు వెళ్లి దాక్కుంటున్నారు. దానికి రక్షణ కంచె లేకపోవడంతో పిల్లలు ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.



రఫీ గీతాలకు ప్రేక్షకుల ఫిదా

తెనాలి: అమరగాయకుడు మహమ్మద్ రఫీ 43వ వర్ధంతి సందర్భంగా స్థానిక రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి ×రఫీ సాబ్‌కె గానే< పేరుతో మహమ్మద్ రఫీ పాటలతో సంగీత విభావరిని నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ఈ సంగీత విభావరిని నిర్వహించటం, తోటి గాయనీ గాయకులతో కలిసి రఫీ పాటలను గానం చేశారు. సంగీతాభిమానుల ప్రశంసలను అందుకున్నారు. గాయకుడు రఫీ వర్ధంతికి ఏటా సంగీత విభావరిని నిర్వహిస్తున్న డాక్టర్ పురుషోత్తమరావును అభినందించారు. పాకీజా, హమ్‌దోనోం, చిరాగ్, ఉస్తాదోంకె ఉస్తాద్, కశ్మీర్ కీ కలీ, అక్బర్ సలీం అనార్కలి, హాతీకీ సఫాయీ, తాజ్‌మహల్, గైడ్, హాథీ మేరే సాథీ, దో రాస్తే, నూరజ్, పగ్లా కహీ కా వంటి హిందీ చిత్రాలు, ఆరాధన, భలేతమ్ముడు తెలుగు చిత్రాల్లో రఫీ, ఇతర గాయనిలు ఆలపించిన పాటలను ప్రముఖ గాయనీ గాయకులు షానవాజ్, ఆలీఖాన్, సైదా, శివలీల, మల్లిక రఫీ ఆలపించారు. కళాక్షేత్రంలో కిక్కిరిసిన ప్రేక్షకులను అలరించారు. సైదా ఆర్కెస్ట్రా వాద్య కళాకారులు సంగీత సహకారం అందించారు. డాక్టర్ పువ్వాడ సోమశేఖర్, డాక్టర్ వంగా సాంబిరెడ్డి, కె.రాజేశ్వరరావు, డాక్టర్ ప్రసాదరావు, డాక్టర్ రంగారావు, డాక్టర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పురుషోత్తమరావు, మల్లిక గానాలాపన

అమ్మభాషలో రాణిస్తేనే ఇంగ్లిష్‌పై పట్టు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లి పట్టణ అమరావతి ఐకాన్ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్న సులభంగా ఇంగ్లిష్ నేర్చుకుందాం శిక్షణ తరగతి ఆదివారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాస్టర్ పాగోలు రాజు మాట్లాడుతూ వేగంగా పరిగెడుతున్న ప్రపంచంతో పోటీగా విద్యార్థులు పరిగెత్తాలని సూచించారు. మాతృభాషలో రాణిస్తేనే ఇంగ్లిష్‌లోనూ రాణిస్తారని వివరించారు. నేర్చుకోవాలనే తపన ఉన్న విద్యార్థులు ఎప్పటికీ ముందంజలో ఉంటారని తెలిపారు. ప్రతి విద్యార్థిలో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని వెలికితీయడం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల బాధ్యతని సూచించారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ అవసరమైనా అమ్మ భాషకు కూడా ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. తెలుగులో బాగా మాట్లాడగలిగితేనే ఇంగ్లిష్ చక్కగా మాట్లాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వాహకులు యడ్ల బాలకృష్ణ, ఈదర రాజశేఖర్, రియాజ్ బాష, సురేంద్ర, నాగరాజు, వై. సుబ్బారావు, షితిజ, పీఈటీ రమేష్, పిన్నమనేని విజయ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు తెనాలి ఎమ్మెల్యే పరామర్శ

నగరంపాలెం: గాయపడిన కానిస్టేబుల్ రమేష్‌బాబుకి మెరుగైన చికిత్స అందించాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. తెనాలి వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో శనివారం దుండుగులను పట్టుకునే ప్రయత్నంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్‌ను ఆదివారం పరామర్శించారు. కానిస్టేబుల్ తండ్రి బసవయ్యకు ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే వెంట తెనాలి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎం.హరిప్రసాద్, తెనాలి ఒకటో టౌన్ సీఐ కె.చంద్రశేఖర్ ఉన్నారు



రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలి

రేపల్లె రూరల్: అమృత్‌భారత్‌లో భాగంగా ఆధునికీకరణ చెందుతున్న రేపల్లె రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ అన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధిలో చేపట్టాల్సిన పలు అంశాలను స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్ఎం సైమన్, డివిజనల్ కో–ఆర్డినేటర్ అనూషకు ఆదివారం వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. టెర్మినల్ పాయింట్ ఏర్పాటు చేసి, సీడబ్ల్యూయూ స్టాఫ్‌ను రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేస్తే రాబోవు రోజుల్లో రైళ్లకు సంబంధించిన రిపేర్లు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా కోచ్ ఇండికేషన్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. తూర్పుగేటు రోడ్డు నుంచి పడమర వైపు గేట్ రోడ్డుకు స్ట్రెయిట్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. బ్రిటీష్‌కాలం నాటి బ్రిడ్జ్‌ను తొలగించి రాబోయే రోజులలో డెమో రైలు ఆగే పాయింట్ వద్ద నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన రైల్వే అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

